క్లుప్తంగా

చురుగ్గా రహదారి నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

సారవకోట: మండలంలోని మాళువ గ్రామానికి మంజూరైన పంచాయతీ ఏకగ్రీవ నిధులు రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. హిరమండలం రోడ్డు నుంచి మాళువ గ్రామానికి వెళ్లేందుకు ఈ నిధులతో పాటు పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా జోడించి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

శిష్టకరణ సంఘం సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న సదాశివుని కృష్ణ

నరసన్నపేట: నరసన్నపేటలో శిష్టకరణ సంఘం సేవలు విస్తరించాలని ఆ సంఘం అధ్యక్షుడు సదాశివుని కృష్ణ కోరారు. నరసన్నపేట సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘం ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంట్లో అధ్యక్షుడిగా సదాశివుని కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంపలాం వసంత కుమార్, కోశాధికారిగా ఎం.వి.జె.మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా రాజమహంతి గోవింద రాజులు ఎన్నుకున్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి



ఎన్నికైన సంఘం సభ్యులు

నరసన్నపేట: పూరి జగన్నాథ వడ్డి పండా కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆ సంఘం సభ్యులు కోరారు. నరసన్నపేటలో ఆదివారం ఆ కుల సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మందస, పాతపట్నం, ఇచ్ఛాపురం, సోంపేట తదితర మండలాల నుంచి పలువురు సమావేశానికి హాజరయ్యారు. ఇంటిపేరు కులం పేరుగా ఉన్నందున కుల ధ్రువీకరణ పత్రం మంజూరు కాక ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడిగా పండిత వెంకటేశ్వర పాణిగ్రాహి, అధ్యక్షుడిగా పండిత గోవిందరావు, ఉపాధ్యక్షుడిగా పండిత రాంబాబు, కార్యదర్శిగా ఎం.జి.ఎస్.రామచంద్రరావు ఎన్నుకున్నారు.

ఎస్‌ఈఈపీ జాతీయ కమిటీ కార్యదర్శిగా రాజేశ్వరరావు



పాతపట్నం: స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (ఎస్‌ఈఈఎఫ్) జాతీయ కమిటీ కార్యదర్శిగా తాను నియామకమైనట్లు పాతపట్నంకు చెందిన జి.రాజేశ్వరరావు ఆదివారం తెలిపారు. బలవన్మరణాలు లేని భారతదేశం అనే నినాదంతో ఈదా ఫౌండేషన్ పనిచేస్తుందనన్నారు. ఫౌండేషన్ చైర్మన్‌గా ఇదా శ్యామ్యూల్ రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాజేశ్వరరావుకు పాతపట్నం ప్రభుత్వ మోడల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొండాల చక్రపతి, విశ్రాంతి అధ్యాపకుడు తూలుగు తిరుపతిరావు, శాఖా గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, వైద్యుడు జి.వేణుగోపాల్, ఆర్.మల్లికార్జునరావు, పెద్దింటి అప్పారావు అభినందించారు.

అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పొందూరు: స్థానిక రామభజన వీధిలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పొందూరు, తండ్యాం, బొట్లపేట, ఎస్‌ఆర్‌ఎస్ కాలనీ, ఎరుకుల కాలనీ తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాలను గమనించాలన్నారు. రాష్ట్ర పురోగతి, ప్రజాసంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయనతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. –సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: మెళియాపుట్టిలోని ముస్లిం వీధిలో నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి : రొట్టవలసలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ



ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న సచివాలయ కన్వీనర్ బి.రవికుమార్, తదితరులు



ఎల్.ఎన్.పేట: చిన్నకొల్లివలస పునరావాస కాలనీలో స్టిక్కర్లు అతికిస్తున్న మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు



హిరమండలం: సుభలయలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: కొడూరులో ఇంటింటికీ వెళ్లి సిక్కర్లు అంటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: గోపాలపెంటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్



బూర్జ: కొత్తవలసలో స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



సారవకోట: లక్ష్మీపురం వద్ద వ్యవసాయ కూలీలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: ఓంద్రుజోలలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

పాతపట్నం: మండలంలోని అన్ని చర్చిల్లో ఈస్టర్ సండే పురస్కరించుకుని ఏసు పునరుద్ధరణ ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్‌లో గల జేసీపీఈఎం చర్చిలో విజయ్ కుమార్, పాస్టర్ జి.ప్రసాద్ మాట్లాడుతూ మరణాంతరం తిరిగి లేచి 40 రోజులపాటు తన శిష్యులతో సంచరించి, తన మహిమను ఏసు చాటుకున్నారన్నారు. సంతోష్ కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలని పలు గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ సండే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దకొల్లివలస గ్రామంలోని చర్చిలో పాస్టర్ ఎస్.రాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షణ కోసం, లోక శాంతి కోసం ఏసు క్రీస్తు అవతరించారని, అందరికీ శాంతి మార్గంలో నడిపించేది ఏసు ప్రభువేనని పాస్టర్



పాతపట్నం: బోధనలు చేస్తున్న పాస్టర్ ప్రసాద్

రాజు అన్నారు. తురకపేట సెంటర్, ఎల్.ఎన్.పేట, కోవిలాం కాలనీ, రావిచెంద్రి గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు, టి.వి.రమణ, కె.రవికుమార్, పి.గోవింద్, థామస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో ఈస్టర్ పండుగను నిర్వహించారు. పాస్టర్ శామ్యూల్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఆమదాలవలస: ఈస్టర్ పండగను నిర్వహిస్తున్న క్రైస్తవులు

సమావేశాలకు అనుమతి తప్పనిసరి

బూర్జ: బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలకు అనుమతులు విధిగా పొందాలని స్థానిక ఎస్సై బి.అశోక్ బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఏప్రిల్ 5వ తేదీ రాత్రి 10 గంటల నుంచి మే 4వ తేదీ రాత్రి 10 గంటల వరకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక ఆదేశాల ప్రకారం బహిరంగ సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు వంటివి చేపట్టడానికి వీలు లేదన్నారు. పోలీస్ చట్టం సెక్షన్ 30, 31 ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో గల రాజకీయ పార్టీ నాయకులు ఈ నిబంధనలు ప్రకారం నడుచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాలకు రక్షణ కల్పించాలి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ ఆవరణలో గల పార్కింగ్‌లో వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని ఏపీ పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ బొడ్డేపల్లి మోహన్‌రావు కోరారు. ఆదివారం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు పార్కింగ్ చేసిన వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాయన్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి పార్కింగ్ స్థలంలో పైకప్పు వేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొత్తూరు: కొత్తూరు గ్రామానికి చెందిన గుడ్ల శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన సి.హెచ్.విశ్వనాథం, జి.గాంధీతోపాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.గోవింద ఆదివారం తెలిపారు. సిరుసువాడ రెవెన్యూ గ్రూపులోని సర్వే నంబర్ 89/23లో కుంటిభద్ర గ్రామానికి చెందిన పిన్నింటి చినబాబు నుంచి శ్రీధర్ 26 సెంట్లు కొనుగోలు చేశారు. ఆ స్థలంలో వేసిన ఫెన్సింగ్‌ను పాడుచేసినట్లు శ్రీధర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాతపట్నం: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ పోలాకి మండలం చిన్నజడూరు గ్రామానికి చెందిన డంకాన సోమేశ్వరరావు (31) మృతి చెందాడని ఏఎస్‌ఐ జి.సింహాచలం ఆదివారం తెలిపారు. సోమేశ్వరరావు ఈ నెల 4వ తేదీన పాతపట్నం అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న హెచ్‌బీ కాలనీలోని ఓ ఇంట్లో పాల్‌సీలింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడన్నారు. తీవ్ర గాయాలవ్వడంతో వెంటనే పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారన్నారు. అక్కడ వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారన్నారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారన్నారు. 8వ తేదీ అర్ధ రాత్రి చికిత్స పొందుతూ సోమేశ్వరరావు మృతి చెందారన్నారు. మృతుడికి భార్య బంగారమ్మ, కుమారుడు హేమంత్ ఉన్నారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రేగిడి లక్ష్మి

పొందూరు: స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎండలు తీవ్రత ఎక్కువ కావడంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.రాధాకృష్ణ తెలిపారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

కొత్తూరు: కొత్తూరు మండలం కురిగాం ఎస్సీ బాలుర వసతి గృహానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి అన్నెపు సాయికృష్ణ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సాయికృష్ణ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవింద తెలిపారు. కురిగాం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వసతి గృహానికి సాయికృష్ణ నడిచి వస్తున్నాడు. కురిగాం నుంచి సీతాపురం వైపు బైక్‌పై వెళ్తున్న బలద గ్రామానికి చెందిన ఎం.నాగేశ్వరరావు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయికృష్ణకు గాయాలు తగలడంతో 108 వాహనం ద్వారా మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

నైతిక విలువలు పాటించాలి



డాన్స్ చేస్తున్న చిన్నారులు

కొత్తూరు: విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలని ప్రముఖ ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మెట్టూరులో గల శ్రీ సత్య సాయి ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం జరిగిన వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రచవనలు చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల వ్యవహార శైలిని విద్యార్థులు అనుకరిస్తారన్నారు. తల్లిదండ్రులు మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. చిన్నారులను ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పిట్ట గంగన్న, టీటీడీ ఆధ్యాత్మిక మండలి కొత్తూరు మండలం కన్వీనర్ పాగిర రవి, సత్యసాయి భక్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను కలిసిన ఎన్ని సూర్యారావు

పోలాకి: మబగాంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన ఎన్ని సూర్యారావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సూర్యారావు స్వగ్రామం వనితమండలం కావటంతో మొదటి నుంచి తమ కుటుంబంతో సత్సంబంధాలున్నాయని ఎమ్మెల్యే అన్నారు. అసోషియేషన్‌కు సేవలందించి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వనితమండలం సర్పంచ్ ఎన్ని వెంకటేష్ ఉన్నారు.



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కలిసిన ఎన్ని సూర్యారావు

విద్యా గిఫ్ట్ స్టోరేజ్ పరిశీలన



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, డీఈఓ

నరసన్నపేట: ఈ ఏడాది నాల్గో విడత జగనన్న విద్యా కానుక కిట్లు పక్కాగా విద్యార్థులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ప్రత్యేకాధికారి భాస్కరరావు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బోర్డు స్కూల్‌లో విద్యా గిఫ్ట్ స్టోరేజ్‌గా ఏర్పాటు చేయడంతో వాటిని డీఈఓ పగడాలమ్మతో కలిసి ఆదివారం పరిశీలించారు. సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాకుండా ఈ ఏడాది జగనన్న విద్యా కానుక కిట్లు అందరికీ ఒకేసారి అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే మొదటి వారంలో ఈ కేంద్రానికి చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ శాంతారావు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సమాజ సేవ పుణ్యకార్యంతో సమానం

పోలాకి: సమాజ సేవలకు మించిన పుణ్యకార్యం మరెక్కడా లేదని ప్రముఖ ప్రవచనకర్త యిప్పిలి రామకృష్ణశర్మ అన్నారు. చింతాడపేటలోని శ్రీరామయోగి సేవాశ్రమంలో ఆదివారం నిర్వహించిన సత్సంగం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భగవంతుడు అనేక మార్లు తన ఉనికి ద్వారా ఇదే విషయాన్ని ప్రధానంగా బోధించారని గుర్తుచేశారు. సంప్రదాయాలను గౌరవిస్తూ యువత ముందుకు సాగాలని, ఆ దిశగా పెద్దలైన ప్రతిఒక్కరూ తరువాత తరాల వారికి సూచనలు చేస్తూ తమ బాధ్యతను నిర్వహించాలన్నారు. సేవాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రవచనకర్తలు, సత్సంగం ప్రియులు పాల్గొన్నారు.



సత్సంగంలో మాట్లాడుతున్న రామకృష్ణశర్మ

ఆదివాసీల ఆరాధ్య దైవం రాంజీగోండ్



హాజరైన గిరిజనులు



మాట్లాడుతున్న ఆదివాసీ లీగల్ సెల్ న్యాయవాది రవి

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి కాలనీలో రాంజీగోండ్ వర్ధంతి కార్యక్రమాన్ని గిరిజనులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదివాసీ లీగల్ సెల్ న్యాయవాది రవి, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. రాంజీగోండ్ ఆదివాసీల ఆరాధ్య దైవమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సేవలను కొనియాడారు. అనంతరం బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేయడం బాధాకరమని, గిరిజన ఎమ్మెల్యేలందరూ రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పూనెం పాపారావు, సవర చొక్కారావు తదితరులు పాల్గొన్నారు.